పనులు ఉన్నా.. ఉపాధి సున్నా

- పది వేల మందికి మూడు నెలలుగా పస్తులు
- సరైన సమయంలో కల్పించని పనులు
- ఉపాధి సెల్ఫ్‌లో పీఆర్ పనులు
- ఇంటికే పరిమితమైన కూలీలు



ఉపాధి పనులకు నోచుకోక కేవీ పోడులో రోడ్డును మూసి వేసిన డొంకలు



గుడిమెళ్లంకలో తుప్పలతో పూడుకుపోయి ఉపాధి పనులకు నోచని పంట బోదె

మలికిపురం: రాజోలు దీవిలో 30 వేల ఎకరాలకు గాను ప్రస్తుం కేవలం 5 వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగవుతుంది. ఇక కొబ్బరికి ధర ఉన్నా దిగుబడి లేదు. ఈ దీవిలో సగం చెట్లు పనికి రాకుండా పోయాయి. కాబట్టి పని చెప్పే రైతే లేడు. ఇక ఉన్న ఏకైక ఉపాధి మార్గం.. ఉపాధి హామీ పనులు. ఇవి కూడా ఆపేస్తే కూలీలు బతికేదెలా.. రాజోలు దీవిలో సుమారు 10 వేల మంది ఉపాధి కార్మికులు అధికారికంగా ఆ శాఖ నమోదు చేసి పనులు చెబుతుంది. గత మూడు నెలలుగా పనులు లేవని రావద్దని ఆ శాఖ సిబ్బంది చెబుతున్నారు. కానీ వాస్తవంగా పనులు ఉన్నాయి. కానీ నిధులు రావడం లేదని పనికి రావద్దని అంటున్నట్లు తెలుస్తోంది. దీనికి కారణం గత కొంతకాలంగా వేతనాలు కూడా పడని స్థితి ఇక్కడ నెలకొంది. రాజోలు దీవిలో ఉపాధి హామీ పనులు ఎక్కడ వేసి గొంగళి అక్కడే అన్న చందాన సాగుతున్నాయి. రాజోలు దీవిలోని గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పనులు ఉపాధి హామీలో ఏమాత్రం సాగడం లేదు. భూ అభివృద్ధి పనులతో పాటు పంట బోదెలు, కాలువలు బాగు చేయడం రైతులకు ఉపయోగపడిన సమయంలో చేయలేదు. ఫలితంగా వ్యవసాయం చేసుకునే వీలులేదు. సాధారణంగా మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో ప్రస్తుత సార్వా సీజన్‌లో వెయ్యి ఎకరాల్లో కూడా నాట్లు పడలేదు. ఏకంగా ఆరు కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్లు రికార్డుల్లో ఉంది. రైతులు మాత్రం ఎక్కడా పనులు చేయలేదని అంటున్నారు. ఇదిలా ఉంటే సాధారణ ఉపాధి పనులు చేస్తున్న ఎన్ఆర్‌జీఎస్ సెల్ఫ్ (ప్రతి పాదిత లిస్ట్)లో పంచాయతీ రాజ్ (సీసీ, గ్రామీణ రోడ్లు) పనులు కూడా నమోదు చేస్తున్నారు. గతంలో ఇలా లేదు. ఈ సెల్ఫ్‌లో 20 పనులకు మించి కనబడకూడదు. ప్రస్తుతం సెల్ఫ్‌లో ఉన్న సీసీ రోడ్ల పనులు నిధులు విడుదల లేక అలానే చూపిస్తున్నాయి. ఫలితంగా సాధారణ ఉపాధి పనులు చేర్చే అవకాశం బాగా తక్కువ ఉంది. ఈ కారణంగా రాజోలు దీవిలో మేన్ వేజ్ అధికంగా ఉన్నా చేయాల్సిన ఉపాధి పనులు బాగా వెనుకబడి ఉన్నాయి. ప్రభుత్వానికి భయపడి ఆ శాఖ సిబ్బంది బయటకు చెప్పడం లేదు గానీ ఇలా పనులు జరగకపోవడం వల్ల రైతులకు, ఉపాధి కూలీలకు చాలా ఇబ్బందులు వస్తున్నట్లు అవగతం అవుతోంది. సెల్ఫ్‌లో పూర్తి కాని కారణంగా కొత్త పనులు చేర్చే అవకాశం లేక, కూలీల వేతనం ఈ ఏడాది సక్రమంగా పడక గడచిన మూడు నెలలుగా కనీసం పనులు జరగని దుస్థితి నెలకొంది. పూట గడవక కూలీలు ఇంటికే పరిమితం అయిన సంఘటనలు కూడా ఇక్కడ నెలకొన్నాయి. చేసిన పనులకే వేతనాలు పడక వర్షాలకు పనులకు రాలేని అనేక మంది కూలీలు ఉన్నారు. 60:40 నిష్పత్తిలో మేన్ వేజ్, మెటీరియల్ కాంపోనెంట్ బేలన్స్ చేసే ప్రక్రియలో ఒక్కో నెల ఏకంగా పరిమితికి మించి మేన్ వేజ్ చేయడం వల్ల 15 నెలల కూలీల వేతనాలకు ప్రభుత్వం నిలిపి వేసింది. వాటిని ఇటీవల క్లియర్ చేసింది. ప్రస్తుత మూడు వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం రాజోలు దీవిలో సుమారు 55 శాతం ఉపాధి పనులు పూర్తి చేశారు. ఇంకా 40 శాతం పైబడి పెండింగ్‌లో ఉన్నాయి. అయితే నిధులు విడుదల లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందాన ఉంది. కూలీలు పనులకు రావడం లేదు. ఉపాధి సిబ్బంది కార్యాలయాలకు రావడం లేదు. గతంలో ఎప్పుడు కూడా ఈ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఈ దుస్థితి ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం కుటుంబానికి 100 రోజులు మేన్ వేజ్ మాత్రమే ఇస్తుంది. 200 రోజులు ఇవ్వాల్సి ఉన్న అది జరగడం లేదని మేధావులు అంటున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన తరువాత ఇది సరాసరి 60 రోజులకి పడిపోయిందని అంటున్నారు. ఇదిలా ఉంటే జూలై నెల నుంచి రైతులకు కొబ్బరి తోటల పనులు చేయించే సిబ్బంది ప్రస్తుతం అది తొలగించామని చెబుతున్నారు.

పూర్తి కాని ఈ-కేవైసీ

ప్రభుత్వం కొత్తగా ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం)లో ఈ-కేవైసీ నమోదు తప్పనిసరి చేసింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ నమోదు ప్రారంభించి ఇదే నెల 30వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రకటించింది. అయితే కూలీలు ఎంత మంది అందుబాటులో ఉన్నారు. వలస వెళ్లిన కూలీల నమోదు ఏంటి అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

సమతుల్యత దెబ్బతింది



ఉపాధి పనుల తీరులో సమతుల్యత దెబ్బతింది. ప్రభుత్వాలు నిధులు పెంచకపోవడం, కేటాయింపులు సక్రమంగా విడుదల లేదు. ఫలితంగా పనుల కోత వల్ల కూలీలకు పూర్తి స్థాయిలో పని దినాలు ఉండడం లేదు. గతం కంటే ప్రస్తుత యాప్‌లలో సాంకేతిక లోపం, అడ్డగోలు నిబంధనలు కూడా వేధిస్తున్నాయి. గత కొన్ని నెలలుగా నిలిచిపోయిన పనులు ప్రారంభించి కూలీలకు పని దినాలు కల్పించాలి.

– ముత్యాల శ్రీనివాసరావు, ఉపాధి కూలీల సంఘం జిల్లా అధ్యక్షుడు

పని చెప్పి మూడు నెలలైంది



గడచిన జూలై నెలలో ఉపాధి హామీ పనికి వెళ్లాను. మరలా పని చెప్పలేదు. మూడు నెలలుగా ఉపాధి పనులు లేవు. తమకు వేరే పని లేదు. వయస్సు మళ్లిన భర్త ఇంటి వద్దనే ఉంటారు. నేనే పనికెళ్లి కుటుంబాన్ని పోషించాలి. మూడు నెలలుగా పని లేక డబ్బులు లేక కనీసం తినడానికి ఇబ్బంది అవుతుంది. తాము ఎలా బతికాలో అర్థం కావడం లేదు.

– చేట్ల లక్ష్మి, ఉపాధి కూలి, మలికిపురం

భూ అభివృద్ధి పనులు జరగడం లేదు



ఉపాధి పనుల 60:40 నిష్పత్తిలో మేన్ వేజ్ టార్గెట్ పూర్తి చేశారు. భూ అభివృద్ధి పనుల విషయంలో నిధుల మంజూరు, పనుల కేటాయింపులు లేక ఇబ్బంది ఉంది. సెల్ఫ్‌లో 20కి మించి పనులు ఉండరాదు. ఈ ఏడాది సీసీ రోడ్ల వంటి పంచాయతీ రాజ్ పనులు కూడా ఉపాధి సెల్ఫ్‌లోనే ఉంచడం వల్ల సాధారణ ఉపాధి పనులకు అవరోధంగా మారింది.

– గేదెల లక్ష్మి, ఏపీఓ, మలికిపురం

క్లుప్తంగా

కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించండి



సమావేశంలో పాల్గొన్న సమరసతా ఫౌండేషన్ ప్రతినిధులు

మామిడికుదురు: హిందువులు దేశం కోసం పోరాడుతున్నారని, మనం నిర్మించుకున్న దేవాలయాలను శక్తి కేంద్రాలుగా మార్చాలన్న కార్యాచరణకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని విజయవాడ ప్రాంత సహ సంయోజక్ తులసీ సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆది జాంబవ సమావేశం జరిగింది. మన దేవాలయాలను మనం పరిరక్షించుకునేందుకు కుటుంబ సమేతంగా దేవాలయాలను సందర్శించాలన్నారు. ప్రతి ఒక్క హిందువు దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ వాకాడ శ్రీనివాసరావు, పరియోజన ప్రముఖ్ కముజు వెంకటశివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాయితీ పశువుల దాణా కేటాయించాలి



జేసీ నిషాంతికి వినతిపత్రం, బొకే ఇస్తున్న శ్రీనివాస్

మామిడికుదురు: పాడి రైతులకు రాయితీపై అందించే పశువుల దాణాను మామిడికుదురు సొసైటీకి కేటాయించాలని కోరుతూ సొసైటీ చైర్మన్ యాలి శ్రీనివాస్ బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి వినతిపత్రం ఇచ్చారు. అమలాపురంలో జేసీని కలసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించిన తరువాత రాయితీ దాణాపై వినతిపత్రం ఇచ్చారు. దీనిపై జేసీ సానుకూలంగా స్పందించారని చెప్పారు. తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారన్నారు.

ఉపాధి పనుల తనిఖీ

మలికిపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు బుధవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. మలికిపురం మండలంలో లక్కవరం, గొల్లపాలెం గ్రామ పంచాయతీల వద్ద వెరిఫికేషన్ సభలు నిర్వహించారు. దీని నిమిత్తం ఢిల్లీ నుంచి కేంద్ర తనిఖీ బృందం హాజరైంది. ఎంపీడీఓ సీహెచ్ లక్ష్మీకల్యాణి, ఏపీఓ లక్ష్మి, ఏపీఎం సయీద్, గ్రామ సర్పంచ్‌లు కోట పుష్పకుమారి, మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యా సమస్యలు పరిష్కరించాలి

అంబాజీపేట: పాఠశాలల్లో ఎదుర్కొంటున్న విద్యా సమస్యలను ప్రభుత్వం తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షుడు చెవ్వూరి రవి డిమాండ్ చేశారు. అంబాజీపేట మండల విద్యా కేంద్రంలో జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు రవి మాట్లాడుతూ 30 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఉమ్మడి సీనియారిటీ పదోన్నతులకు ప్రతిబంధకంగా తయారైందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ కల్పించాలన్నారు. విద్యేతర కార్యక్రమాలను తగ్గించి ఉపాధ్యాయులకు తగినంత బోధన కల్పించాలన్నారు. అనంతరం రవిని ఎంఈఓలు, హెచ్ఎంలు ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా ఏపీహెచ్ఎంఏ అధ్యక్షుడు మోకా ప్రకాష్, ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

ఆలమూరు: గ్రామ శివారు కొత్తూరు సెంటర్‌లో బుధవారం సాయంకాలం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. స్థానిక బస్టాండు సెంటర్ నుంచి చింతలూరు కాలనీ వరకూ పరుగులు పెడుతూ ఆరుగురిని కరిచి పరారైంది. గాయపడిన వారిలో పలువురికి రక్తస్రావం కాగా సమీపంలోని పెదపళ్ల పీహెచ్‌సీలో చికిత్స పొందారు. మండలంలోని గ్రామ పంచాయతీలు కుక్కల నియంత్రణ అధికంగా ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టకపోతే రేబిస్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు పిచ్చికుక్కను గుర్తించి చికిత్స చేయాలని వారు కోరుతున్నారు.

చిన్నారులకు టీకాలు

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలు అందజేశారు. వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పలు గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలు, గర్భిణులకు ఇంజెక్షన్లు అందజేశారు.

వేమన సందేశాలు నేటి యువతకు మార్గదర్శకాలు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి



గోపాలపురంలో యోగి వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: నేటి యువతకు యోగి వేమన అందించిన సామాజిక సందేశాలు మార్గదర్శకంగా నిలుస్తాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని గోపాలపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ తత్వవేత్త, ప్రజా కవి యోగి వేమన విగ్రహాన్ని బుధవారం ఘనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి హాజరయ్యారు. ఆయనతో పాటు యోగి వేమన విగ్రహ దాత క్రియేటివ్ గ్రూప్ అధినేత కొవ్వూరి నరేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ యోగి వేమన సామాజిక సందేశాలు, ఆచరణలో విలువలు ఈనాటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. సమాజంలో సమానత్వం, నైతికత, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ తన జీవితంలో అవలంబించాలన్నారు. యోగి వేమన విగ్రహం గ్రామానికి స్ఫూర్తిదాయక ప్రతీకగా నిలుస్తుందన్నారు. అనంతరం కమిటీ పెద్దలు, యువత అందరూ కలిసి జగ్గిరెడ్డి, నరేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంతో ఆత్మరక్షణలో కూటమి

- మాజీ మంత్రి గొల్లపల్లి
- నేటి నుంచి కోటి సంతకాల రచ్చబండ సభలు



మలికిపురంలో రచ్చబండ షెడ్యూల్ విడుదల చేసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, నాయకులు

మలికిపురం: రాష్ట్రంలో బయటపడ్డ నకిలీ మద్యం స్కాంతో కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడిందని మాజీ మంత్రి, రాజోలు వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం గ్రామస్థాయి రచ్చబండ కార్యక్రమాల షెడ్యూల్‌ను బుధవారం ఆయన పార్టీ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రచ్చబండను ప్రభుత్వం కళ్లు తెరిచేలా నిర్వహించాలని అన్నారు. గురువారం నుంచి నియోజకవర్గంలోని గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. కార్యకర్తలు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పాటి శివకుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఈద రవిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు కటకంశెట్టి ఆదిత్య, తాడి సహదేవ్, గుబ్బల మనోహర్, జిల్లెళ్ల ఉదయ్‌కిరణ్, మోకా సురేష్, చింత ప్రసాద్, గుర్రం జాషువా, ఉచ్చుల దాసు, గొల్లమందుల తాతారావు, నల్లి త్రిమూర్తులు, బల్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం



అంబాజీపేటలో కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పాశర్లపూడిలో కలాం జీవిత చరిత్రను వివరిస్తున్న టీచర్ శ్రీనివాసరావు



పి.గన్నవరం సీహెచ్‌సీలో కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

అంబాజీపేట: భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని హెచ్ఎం కడలి సాయిరామ్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో అబ్దుల్ కలాం జయంతిని బుధవారం నిర్వహించారు. తొలుత అబ్దుల్ కలాం చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతిగా దేశ పురోభివృద్ధికి పాటుపడి చిరస్మరణీయుడిగా చైతన్యం నింపిన మహనీయుడు ప్రజలు హృదయాల్లో పదిలంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీఎస్ఎన్ మూర్తి, రామలింగేశ్వరరావు, రాంబాబు, సత్తిబాబు, అరుణజ్యోతి, పూర్ణిమ, అంజిబాబు, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేపర్ బాయ్ నుంచి గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన స్ఫూర్తి ప్రదాత అని పాశర్లపూడి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం కేవీఎస్ నాగోజీరావు శ్లాఘించారు. కలాం జయంతిని బుధవారం స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలాం సాధించిన విజయాలు, ఆయన జీవన ప్రస్థానం, అతని గొప్పదనాన్ని జీవశాస్త్ర ఉపాధ్యాయులు సూరుమేను శ్రీనివాసరావు విద్యార్థులకు వివరించారు. నగరం ప్రధాన ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం బావిశెట్టి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కలామ్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన్ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ ఆరుమిల్లి రామకృష్ణ రూ.30 వేలు విలువైన మూడు వీల్ చైర్స్‌ను, సాధనాల స్వామి నాయుడు, గాలిదేవర మణికంఠ సీలింగ్ ఫ్యాన్లు ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆస్పత్రికి అందజేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సర్పంచ్ బొండాడ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడి వైద్యానికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.17 వేల సాయాన్ని బుధవారం అందజేశారు. సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం అయినవిల్లి మండలం క్రాప గ్రామానికి చెందిన వర్రే వీర వెంకట దుర్గాప్రసాద్ (35) వారం రోజులు క్రితం గంటి నుంచి పలివెల వెళ్లే రోడ్డు లో ప్రమాదవశాత్తూ బండి మీద నుంచి కింద పడిపోవడంతో ఎడమ కాలు నాలుగు చోట్ల విరిగిపోయింది. రావులపాలెంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించారు. రూ.లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతానికి కొంత బిల్లు చెల్లించారు. మిగిలిన అమౌంట్ కట్టే ఆర్థిక పరిస్థితి లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు రావులపాలెంలో ప్రసాద్ చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి రూ.17 వేల చెక్కు సాయంగా అందజేశారు.

పోషకాహార లోపం నివారించాలి



గుడిమెళ్లంకలో సీమంతాలు నిర్వహించిన సీడీపీఓ ఇందిర, ఎంపీపీ, జెడ్పీటీసీలు

మలికిపురం: చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపం నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఐసీడీఎస్ రాజోలు సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. మండలంలోని గుడిమెళ్లంక కల్యాణ మండపంలో బుధవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. అలాగే బాలికో దినోత్సవం కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సుమారు 20 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, సర్పంచ్ నల్లి విజయ కుమారి, ఎంపీటీసీ నల్లి అంజలీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కాండ్రేగుల హైమావతి, కె. సరోజని, చెల్లింగి సత్యనారాయణ, మల్లిపూడి సత్తిబాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పి.గన్నవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. పి.గన్నవరం ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ వై.విజయశ్రీ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రీయ పోషణ మాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్య వంతంగా ఉండాలంటే మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించాలన్నారు. సీడీపీఓ విజయశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. పలువురు చిన్నారులకు ఎమ్మెల్యే అన్నప్రాశన చేశారు. పౌష్టికాహారం స్టాల్‌ను సందర్శించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఆదిమూలం సూరయ్య కాపు, మైపాల తాతాజీ, అన్నాబత్తుల అనుబాబు, కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గవాయ్‌పై దాడికి నిరసన

మలికిపురం: సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా రాజోలు నియోజకవర్గ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్, దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. ఫూలే–అంబేడ్కర్ భవనం నుంచి గాంధీ బొమ్మ వరకు నిరసన ప్రదర్శన చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు.

పురస్కార గ్రహీతకు అభినందనలు

రావులపాలెం: స్వచ్ఛాంధ్ర రాష్ట్రస్థాయిలో కొవ్వూరు ఆర్టీసీ డిపో బస్ కాంప్లెక్స్‌కు రెండో స్థానం లభించింది. ఈ అవార్డును స్వీకరించిన అప్పటి మేనేజర్, ప్రస్తుత రావులపాలెం డిపో మేనేజర్ అయిన వైవీవీఎస్ కుమార్‌ను స్థానిక గ్యారేజ్ సిబ్బంది, సూపర్‌వైజర్లు బుధవారం అభినందించారు. డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర దిశగా తాను అవార్డు స్వీకరించడానికి అందరూ సమష్టిగా కృషి చేయడం వలనే సాధ్యమైందన్నారు. ఇదే స్ఫూర్తితో రావులపాలెం డిపోలో కూడా పరిరక్షణ మొక్కలు నాటడం ద్వారా అవార్డు సాధించడానికి కృషి చేయాలన్నారు.

75 వసంతాల జీవనయానం

50 వసంతాల రంగస్థల ప్రస్థానం



డాక్టరేట్ అందుకుంటున్న సత్యనారాయణ

మామిడికుదురు: నగరం గ్రామానికి చెందిన 75 ఏళ్ల మంగం సత్యనారాయణ కళాకారుడిగా తన ప్రతిభను చాటుకుంటున్నారు. 50 ఏళ్ల నుంచి కళాకారుడిగా సేవలందిస్తూ పలువురి ప్రశంసలు అందుకోవడంతో పాటు అవార్డులను సొంతం చేసుకున్నారు. ఏకపాత్రాభినయాలతో పాటు బుర్రకథ కళాకారుడిగా అటు సాంఘిక, ఇటు పౌరాణిక నాటకాల్లో రాణిస్తూ కళాకారుడిగా మంచి గుర్తింపు పొందారు. దీనినే వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. సత్యనారాయణ ఆల్ ఇండియా రేడియోలో బురకథ ప్రదర్శన చేశారు. దీంతో పాటు దూరదర్శన్‌లో పల్నాటి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, మహావీర బబ్రువాహన, అంబేడ్కర్ జీవిత చరిత్ర తదితర ప్రదర్శలు ఇచ్చి ఎంతో మంది ప్రశంసలు పొందారు. రేడియోస్టేషన్‌లో 20, దూరదర్శన్‌లో అయిదు ప్రోగ్రాంలు ఇచ్చారు. షిర్డీ సాయిబాబా మహత్యం, గౌతమ బుద్ధ, పెద్దలు మారాలి, చదువెందుకు, శివగంగ వంటి సందేశాత్మక, పౌరాణిక, సాంఘిక నాటకాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. ఇంత వరకు అయిదు వేల నాటకాలు, బుర్రకథ ప్రదర్శనలు ఇచ్చారు.

100 సన్మానాలు.. 50 అవార్డులు..

కళాకారుడిగా సత్యనారాయణ చేసిన సేవలకు గుర్తింపుగా సుమారు 50కి పైగా అవార్డులు అందుకున్నారు. వందకు పైగా సన్మానాలు పొందారు. గౌరవ డాక్టరేట్, మహానంది, కళారత్న, కళాభూషణ్, పద్మ ప్రతిభ, మధురగాన కళానిధి, గాయకరత్నం, అంబేడ్కర్ ఫెలోషిప్, నందమూరి తారక రామారావు, మథర్ థెరిస్సా వంటి అవార్డులు ఇతని సొంతమయ్యాయి. ప్రముఖ సినీనటులు సుమన్, సుద్దాల అశోక్ తేజ, గొల్లపూడి మారుతీరావు, రాళ్లపల్లి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు.

మా పూర్వీకులు కళాకారులే..



మంగం సత్యనారాయణ

మా పూర్వీకులు కళాకారులే. వారి నుంచి వారసత్వంగా నేను కళాకారుడిగా గుర్తింపు పొందాను. చదువుకున్న నాటి నుంచి కళాకారుడు కావాలన్న లక్ష్యంతో సాధన చేశారు. కళాకారులకు అండగా నిలవాలన్న ఆశయంతో కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘాన్ని స్థాపించాం. దానికి ఐఎస్ఓ గుర్తింపు కూడా వచ్చింది. ఆ సంఘం ద్వారా రాష్ట్ర స్థాయిలో 200 మందికి, కేంద్ర స్థాయిలో 26 మందికి పింఛన్లు మంజూరు చేయించడం నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ కళాకారుడు అవార్డు అందుకోవాలన్నదే నా జీవిత లక్ష్యం.

పాడి అభివృద్ధిలో మెళకువలు అవసరం



గూడపల్లి వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా పశు వైద్యాధికారి వెంకట్రావు

మలికిపురం: గ్రామాల్లో పాడి పరిశ్రమ అభివృద్ధిలో రైతులు మెళకువలు పాటించాలని జిల్లా పశు వైద్యాధికారి కె.వెంకట్రావు అన్నారు. మండలంలోని గూడపల్లిలో బుధవారం జరిగిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధికి తమ శాఖ చాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ప్రభుత్వం ఇచ్చే రుణాల ద్వారా పశువుల పెంపకంతో ఉపాధి పొందవచ్చని సూచించారు. పాలిచ్చే గేదెలు, ఇతర పశువుల పెంపకం, వాటి ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించి గ్రామీణ పశువైద్యుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 162 పశువులకు గర్భకోశ పరీక్షలు, చికిత్సలు, గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఉచితంగా మందులు అందించారు. మలికిపురం సంచాలకుడు ఎస్.వెంకటేశ్వరరావు, వైద్యులు పి.సూర్యనారాయణరాజు, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షుడు సుందర శ్రీనివాసరావు, సుందర బ్రహ్మయ్య, సొసైటీ చైర్మన్ పున్నం గంగారావు, కొనిదెల శ్రీనివాసరావు, కటికిరెడ్డి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో..

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో బుధవారం పశుసంవర్ధక శాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ(కాకినాడ) ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 50 పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన పరీక్షలు వైద్యులు బీబీ సంపత్‌కుమార్, తోట నవీన్ నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులను రైతులకు ఉచితంగా అందజేశారు. అలాగే రైతులకు ఖనిజ లవణ మిశ్రమం ప్యాకెట్లు, లివర్ టానిక్స్, మినరల్ బ్లాక్స్ పంపిణీ చేశారు. గ్రామస్తులు ఉండపల్లి అంజిబాబు, యెనుముల తాతాజీ, పారా మెడికల్ సిబ్బంది పీవీఎల్ఎస్ఎన్ మూర్తి, బీ.జానకి రామారావు, సతీష్, శ్రీను, రైతులు పాల్గొన్నారు.